



## తప్పులెన్నువారు తమతప్పు లెరుగరు

ఇది లోకసామాన్యం, ఓరోజు సైకిలెక్కి బజారువెళ్లితే ఓచిన్న సంఘటన జరిగింది.

ఒక మునిపల్ ఉద్యోగి సైకిల్ లైసెన్సు రుసుము చెల్లించనివారి సైకిళ్ళను జప్తుజేసి జుల్మానా విధిస్తున్నాడు. దురదృష్టవశాత్తు నా సైకిల్ కు లైసెన్సు రుసుము చెల్లించలేదు. నన్ను పిలచి, నా సైకిల్ రుసుముచెల్లించని దానికి కారణ మడుగుతూ జప్తుజేసి రసీదిస్తాను, డబ్బు (జుల్మానాతో సహా) చెల్లించి సైకిల్ తీసి కెళ్ళుమన్నాడు.

ఎందుకో నాదృష్టి అతని సొంత సైకిల్ పైపడింది. దానిని పరికించిచూచా. దానికి లైసెన్సులేదు "ఏమయ్యా నీవుమాత్రం లైసెన్సు రుసుము చెల్లించ నవసరము లేదా? పాపం! ఆచట్టం మీకు వర్తించ లేదేమోలెండి!" అన్నాను. చుట్టూచేరిన వారందరూ నవ్వి హేళనచేస్తూ అతనిని తలోమాట అన్నారు.

పాపం! అతను వంచిన తల పైకెత్తనేలేదు. ఇదే సందుకదా అని నేను సైకిలెక్కి ఉడాయించేశా!!

అప్పాజి రామచంద్రయ్య.

* * *

## ధైర్యం

మా వూళ్ళో వెంకయ్య శెట్టిగారంటే లక్షకు అధికారి కాలానికి ఖర్మానికి గిట్టక, శెట్టిగార్కి ఒకరోజు మహా తీవ్రంగా ప్రారంభించింది 'కడుపులో నొప్పి', పెద్దవాండ్ల జబ్బులుకూడా పెద్దవిగానే వుంటాయి. డాక్టర్ల రాకపోకలకు తీరికలేకుండావుంది ఎన్నో మందులు. మాకులు. జరుగుతున్నాయి. కాని శెట్టిగారినొప్పి, 'నొప్పి' లాగేవుంది. ఆఖరుకు ఒక ఎం బి, బి. ఎస్ గారు ఒక ఎల్. ఎం పి గారువచ్చి పరీక్షించారు కాని వారి అభిప్రాయాలు, కలవలేదు. ఎం, బి. బి ఎస్ గారు, శెట్టిగారి కడుపులో 'ట్యూమర్' అన్నారు, కాని ఎల్. ఎం పి గారు 'లివర్' అన్నారు, యిలాగా వాదనలోకిదిగారు ఆఖరికి ఒక నిర్ణయానికొచ్చి, సరే, యిప్పుడు, మన అభిప్రాయాలు కలియకపోయినా రేపు పొట్టకోసిచూస్తే తెలీదా? అని వాదించుకున్నారు యిద్దరు డాక్టర్లూనూ, ఇది విన్న శెట్టిగారి, ధైర్యం వేరె చెప్పాలా నాలుగురోజులు, బతకవలసిన జీవుడు ఆరాత్రినిష్క్రమించాడు, ధైర్యం అంటే అది కదా?

టి హనుమంతరావు,

* * *

## "తారుడబ్బా"

రామన్ ఒక సీనియర్ ఇంటర్మీడియేట్ విద్యార్థి. కాలేజీలో చదువుకుంటూ ఒకరింట్లో వసతి నేర్పరుచు కొన్నాడు. వయసువాడు కనుక ఒకనాడు రామన్‌బుద్ధి చలించినది. ఆ యింట్లోగల లక్ష్మి అనే పనిమనిషిపై మోజు కలిగింది. ఆ మనిషి అందకత్తె కాకపోయినా చింత లేదనుకొన్నాడు. ఆనాటిరాత్రి సర్వవిధముల ప్రయత్నించినాడు కాని విఫలమైనాడు. మర్నాడు ఉదయం ఆ పనిమనిషి స్నానపుగదిలో నుండగా రామన్ తొందరపడి లోపల కెళ్ళి తలుపు గొళ్ళెమువేశాడు. పాపం రామన్ దురదృష్టానికి తగ్గట్లు అచ్చట నొక తారు డబ్బాయుంది. వెంటనే లక్ష్మి ఆ డబ్బానెత్తి రాముని తలపైపోసినది పాపం! రాముడు భూతాకారం పొందాడు. ఇంకేం కావాలి రామునికి?

క్రిష్ణమూర్తి.

* * *

## అసలు సంగతి

మా సహాధ్యాయు లందర్లోనూ మూర్తి చాలా అదృష్టవంతుడని చెప్పాలి. యెందుచేత నంటె భోగభాగ్యాలతో పాటు అతనికి దేవుడు కళారాధన, ప్రావీణ్యతకూడా ప్రసాదించాడు. కాని అతనిలో కొన్ని సమయాల్లో పొడసూపె విషాద చిహ్నాలకి అర్థం గ్రహించలేక పోయేవాళ్ళం. యెందరెన్ని సార్లడిగినా చెప్పేవాడు కాదు.

ఒకరోజున మా యింట్లో బారసాలకి

మూర్తీని ప్రత్యేకంగా అహ్వానించాను. కొంత బాతాఖానీ అయిన తరువాత కాంతం చిత్రించిన దృశ్యాలు కొన్నిచూచి తనుకూడా చిత్రకారుడే గనక అనందించగలడనే కుతూహలంతో మూర్తికి కొన్ని చిత్రాలుతెచ్చి చూపించాను. వాటిలో ఒకదృశ్యాన్ని మూర్తీ తదేకదృష్టితో చూస్తున్నాడు. తలవంచి వుండడంచేత అతని ముఖచిహ్నాలు గ్రహించలేక పోయాను. ఐదు నిమిషాల తరువాత పటంమీద నీటిబొట్లు పడడం గ్రహించాను. వెంటనే మూర్తిని భుజంమీద తట్టి ' యేమిటి సంగతని" ప్రశ్నించాను. సమాధానంలేదు. రెండు నిమిషాల తర్వాత మూర్తి విషాదవదనంతో అడిగాడు "నాకోరికొకటి తీరుస్తావా రాజూ" అని "తప్పక తీరుస్తా" నన్నాను.

"యీ చిత్రకారిణిచేత మంత్ర పుష్పం చదివించి వినిపిస్తావా" అన్నాడు. నా కాశ్చర్యం వేసింది. మా కాంతం మంత్రపుష్పం చదవగలదని మూర్తికెలాతెలుసా అని సరే ప్రశ్నలకిది సమయంకాదని మా కాంతాన్నిపిలిచి మా స్నేహితుడికోర్కె తెలియచేశాను మూర్తీ కళారాధకుడనీ నీవేమీ సందేహించవద్దనీ నచ్చచెప్పాను. మూర్తీపేరు వినడంతోనే మా కాంతం ముఖంలో ఆశ్చర్యం ద్యోతకమైంది కాని అభావం వెంటనే సంబాళించుకొని ముందెన్నడూలేని చురుకుదనంతో చదివిందీ సారి. వింటున్నంతసేపూ మూర్తి తన్మయుడై అనందంలో మునిగితేలాడు. పూర్తి కాగానే మారు మాటాడకుండా సెలవు తీసుకొని బయలుదేరాడు.

పనులన్ని ముగించుకొని పడకగది చేరింది కాంతం, పటాల్లో ఒకదాన్ని మూర్తీ తదేకదీక్షతోచూడ్డం, కన్నీరుకార్చడం యివన్నీచెప్పి "అసలు సంగతేమిటి కాంతం" అని ప్రశ్నించాను. "అదంతా యిప్పుడెందుకు లెండి" అన్నది. "పర్వాలేదు చెప్పు" అని బలవంత పెట్టగా చెప్పడం అరంభించింది. తనూ మూర్తీ ఒకస్కూల్లోనే చదువుకున్నామనీ చిన్నప్పుడిద్దరూ అమిత స్నేహంగావుండే వారమనీ తాను వ్రాసిన చిత్రపటాలను మూర్తీ చాలా మెచ్చుకుంటూ వుండేవాడనీ అందులో ప్రత్యేకంగా ఆ (కన్నీటికి కారణమైన) పటం రోజు కొకసారైనా చూడకుండా వుండేవాడు కాదనీ, తల్లిదండ్రుల విముఖతవల్ల తమకు కావలసిన వివాహం జరుగలేదనీ చెప్పింది నా కప్పుడర్థమైంది మూర్తీకి అప్పుడప్పుడూ పొడసూపే విషాదానికి కారణం.

మరునాడుదయమే మూర్తి యింటికి వెళ్ళాను. గది ఖాళీ ఆరాత్రే కాళీ చేసి యెక్కడికో వెళ్ళిపోయాడని మాత్రం తెలిసింది.

విన్నకోట కోటిలింగేశ్వరరావు

* * *

## వృక్ష రాజెవరు?

ఒక అడవియందొక వటవృక్షము, టేకు వృక్షము స్వేచ్ఛాజీవనము చేయుచుండెడివి. ఒకనాడు వటవృక్షము టేకుచెట్టును చూచి "టీకా! నీది కొరగాని బ్రతుకు సుమా! పరోపకారములేని నీవ్యర్థజీవనంబేల? నేను వేసవిలో వేలకొలది ప్రజలకు నీడనిచ్చి కాపాడెదను. శరణార్థులై ఎన్నో పక్షులువచ్చి నాకొమ్మలపై తలదాచుకొనును. శిబి, కర్ణాదులవలె నాజన్మసార్థకమైనది. వృక్షరాజైన నాతో నీకు సాటియా?" అని సగర్వముతో పలికెను.

టీకు వృక్షము ఆ పలుకులువిని "ఓ మఱ్ఱి! యేల యీ ప్రగల్భములు? నీవు బ్రతికియుండి తాత్కాలికపు నీడనిచ్చెదవు. గాని నేను ప్రజాసేవకై మరణించి, కలపయై, ప్రజాభవనము లందుండి గాలివానలకు ఎండలకు ప్రజలు తూలిపోకుండ కాపాడెదను. కుర్చీలు, బల్లలు, మంచములు మొదలగు అవతాంములు దాల్చి ప్రజాసేవ చేయుచుందును. 'జగమెరిగిన బాపనునకు జందెంబేల' అనురీతిని జగద్విఖ్యాతిగల నేను నా ఔన్నత్యము చాటనేల? బడుగు దేహముతో యేరోడ్డు ప్రక్కనే పడియుండక ఊరకనాతో ఈ తగవులేల? గాలిదేవుడున్నాడు జాగ్రత్తా!" అనెను.

వటవృక్షము మౌనము దాల్చెను. వృక్షరాజెవరో నను సందియము కలిగినది.

జగడ గొండులకు 'పరాభవము తప్పదు శాంతి పరులకు సర్వదా సౌఖ్యమబ్బును.

మరువాడ సూర్యప్రకాశం.

* * *


## కావలెను -

ఈ క్రింది పట్టణములకు మా చిత్రగుప్తను విక్రయించుటకు ఏజంట్లు కావలెను. రు **15** లు డిపాజిట్ తప్పని సరిగ చెల్లించేవారుగ నుండవలెను.

**1** సామల్‌కోట, **2** సోంపేట, **3** ఉయ్యూరు, **4** తాడేపల్లిగూడెం, **5** ఆదోని, **6** బాపట్ల, **7** కల్యాణదుర్గం, **8** తణుకు, **9** ఛత్రపూరు, **10** ప్రొద్దుటూరు, **11** కుప్పం, **12** కాళహస్తి, **13** పుత్తూరు, **14** కదిరి, **15** నరసపూర్, **16** ఖమ్మంమెట్టు.